నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | జూన్ 09, 2024 | www.navatelangana.com

పిల్లలను ప్రభుత్వ స్కూళ్లకే పంపాలి

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండలంలోని నర్వ గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో బడి ఈడు పిల్లల సర్వే నిర్వహించి ప్రభుత్వ పాఠశాలకి పిల్లలను పంపాలని మమ్మద్ నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రాజ్, నర్వ పాఠశాల ప్రధానోపాధ్యా యులు చంద్రశేఖర్ ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులకు తెలియజేశారు. కార్యక్రమంలో సిఆర్పిలు శంకర్ గౌడ్, వెంకటరమణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

లోక్‌అదాలత్‌లో 511 కేసుల పరిష్కారం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని మున్సిప్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ లో 511 కేసులను పరిష్కరించినట్లు న్యాయమూర్తి హారిక తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్ కార్యక్రమంలో క్రిమినల్ 47, ఆస్తి తగదాలు1, ఆప్కారి 28, పిటి కేసులు 47, సైబర్ నేరాలు 29 కలిపి మొత్తం 511 కేసులను పరిష్కరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు,కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి హారిక

సొసైటీ దావత్‌లో
డిష్యూం డిష్యూం



- నవీపేట్ సొసైటీ బాడీ మీటింగ్ తర్వాత మందు పార్టీ
- పర్మిట్ రూమ్‌లోనే పాలకవర్గం బాహాబాహి
- స్నేహపూర్వక "సహకారం" లేకనేనా..?
- దిగజారుతున్న పిఎసిఎస్ పాలకవర్గాల ప్రతిష్ట

నవతెలంగాణ-నవీపేట్

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడంతో పాటు రుణ సహకారం అందించడం చిన్న సన్నకారు రైతులకు పారదర్శకత, చేయూతను అందిస్తూ విశ్వసనీయతను పెంపొందించుకోవాల్సిన సొసైటీ పాలకవర్గాలు అవినీతి, అక్రమాలే కాకుండా మందు పార్టీలు చేసుకుంటూ సహకార సంఘాల ప్రతిష్టను రోజురోజుకు దిగజార్చుతున్నారు.



నవీపేట్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండల కేంద్రంలోని పిఎసిఎస్ లో శుక్రవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. డైరెక్టర్ల మధ్య స్నేహపూర్వక సహకారం కొరవడడంతో డైరెక్ట ర్‌లు గంగోని రాము, గోపీల మధ్య మనస్పర్ధాల కారణంగా వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో వారిద్దరిని మిగతా పాల కవర్గ సభ్యులు శాంతింప చేశా రు. అనంతరం మహిళ డైరెక్టర్లు తప్ప చైర్మన్, వైస్ చైర్మన్‌తో సహా మిగతా డైరెక్టర్లు దావత్ కోసం ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ పరిమిట్ రూమ్‌కు వెళ్లి ముక్క, మందు దావత్ చేసుకున్నారు. మద్యం మత్తులో మళ్లీ రాము, గోపిల మధ్య వాగ్వివాదం మొదలై చివరకు డైరెక్టర్‌లు బాలగంగాధర్, సౌదా శ్రీనివాస్‌లతో పాటు చైర్మన్ న్యాలకంటి అబ్బన్నల మధ్య ఘర్షణ చెలరేగి చివరికి మందు సీసాలు పగలగొట్టుకునే వరకు వెళ్లినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో కొందరు డైరెక్టర్లు వారిని శాంతింప చేసే ప్రయత్నం చేయగా కొంతమంది భయంతో పలాయనం సాగించినట్లు వినికిడి.



దావత్ చేసుకొని గొడవ పడ్డ ఎడపల్లిలోని పర్మిట్‌రూమ్

దిగజారుతున్న పాలకవర్గాల ప్రతిష్ట..



రైతుల సంక్షేమం కోసం కృషి చేయాల్సిన పాలకవర్గాలు స్వార్ధ ప్రయోజనాలతో అవినీతి, అక్రమ ఆరోపణలతో పాటు గోవా టూర్లు, దావత్ లు చేసు కుంటూ రైతులు, ప్రజల దృష్టిలో దిగజారుతూ రాజకీయ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని పలువురు చర్చించుకుంటు న్నారు. నవీపేట్ లోనే కాదు జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు కొనసాగుతుందని ప్రభుత్వ యంత్రాంగం ఇటువంటి విషయాలపై క్రమశిక్షణ చర్యలకు పూనుకుంటేనే పాలకవర్గాలు రైతులకు ఆదర్శంగా మారుతాయని రైతులు భావిస్తున్నారు.

సుదర్శన్‌రెడ్డికి
హెూం శాఖ..?

- మంత్రివర్గ విస్తరణలో అవకాశమిచ్చే ఛాన్స్
- ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం కల్పించనున్నట్టు చర్చలు

నవతెలంగాణ-నిజామాబాద్

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి హోం శాఖ మంత్రి పదవి వరించనున్నట్టు సమాచారం. త్వరలో మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఉమ్మడి జిల్లా నుంచి సుదర్శన్‌రెడ్డికి అవకాశం ఇవ్వనున్నట్టు స్థానికంగా హాట్ టాపిక్‌గా మారింది. సౌమ్యుడిగా పేరొందిన సుదర్శన్‌రెడ్డికి హోం శాఖ మంత్రి పదవి కట్టబెట్టనున్నట్టు వినికిడి.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 9 నియోజకవర్గాలకు గాను బోధన్, నిజామాబాద్ రూరల్‌తో పాటు ఎల్లారెడ్డి, జుక్కల్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. అయితే మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఎవరికీ అవకాశం కల్పించలేదు. కామారెడ్డి అసెంబ్లీ సీటును త్యాగం చేసిన షబ్బీర్‌అలీ.. నిజామాబాద్ అర్బన్ నుంచి ఓడినా ఎమ్మెల్సీ పదవితో మైనార్టీ కోటాలో మంత్రిపదవి ఇవ్వనున్నట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఆయనకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల ప్రభుత్వ సలహాదారులుగా ప్రభుత్వం నియమించింది. ఇక నలుగురు ఎమ్మెల్యేలు ఉండగా.. వారిలో సీనియర్ అయిన సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి వరిస్తదని కాంగ్రెస్ శ్రేణులు ఎదురుచూశారు. కాగా అసెంబ్లీ ఎన్నికలు పూర్తికాగానే పాలనపై పట్టు సాధించడంతో పాటు పథకాల అమలు, రివ్యూ తదనంతరం పార్లమెంట్ ఎన్నికలు రావడంతో మంత్రివర్గ విస్తరణ నిలిచిపోయింది. అయితే తాజాగా పార్లమెంట్ ఎన్నికలు పూర్తవ్వడం, రాష్ట్ర వ్యాప్తంగా 8 సీట్లు కాంగ్రెస్ గెలుపొందిన విషయం విధితమే.

సీనియర్.. సిన్సియర్

మాజీ మంత్రి,బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డికి త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణ లో మంత్రి పదవి ఖాయమనే అంతటా ఊహగానాలు వినిపిస్తున్నాయి. అంతే కాదు ఆయనకు మంత్రిపదవి తప్పక వరిస్తుందని జోరుగా చర్చలు సాగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా, వివాదరహితుడిగా, గతంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా, వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పని చేసిన అనుభవం ఉండడంతో ఆయనకు త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో మంత్రిపదవి కట్టబెట్టడానికి అధిష్టానం సానుకూలంగా ఉన్నట్లు పలువురు పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీలో సిన్సియర్, సీనియర్ నాయకుడిగా గుర్తింపు ఉన్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి హెూం శాఖ మంత్రిగా నియమించే అవకాశం ఉన్నట్లు సమాచారం. గతంలో ఆయన భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా, వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పని చేసిన కాలంలో ఎన్నో ప్రాజెక్టులు, జిల్లాకు మెడికల్ కళాశాల తెచ్చిన ఘనత ఆయనది. దాంతో ఆయనకు త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో హెూంశాఖ కట్టబెట్టే అవకాశం ఉన్నట్లు స్థానికంగా చర్చలు జోరందుకున్నాయి.



కాగా నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి ఇన్‌చార్జిగా కాంగ్రెస్ అధిష్టానం సుదర్శన్‌రెడ్డిని నియమించింది. అయితే కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలిస్తే మంత్రి పదవి ఇస్తారని స్థానికంగా చర్చలు వినిపించాయి. కాగా జీవన్‌రెడ్డి ఓడినా.. రాష్ట్రంలో కాంగ్రెస్ 8 లోక్‌సభ స్థానాలు కైవసం చేసుకోవడంతో పాలనపై కాంగ్రెస్ సర్కార్ ఫోకస్ పెట్టింది. ఈ నేపత్యంలో మంత్రి వర్గ విస్తరణ చేపట్టి మంత్రి పదవులను కట్టబెట్టనుంది.

పిడుగు పడి యువకుడు మృతి

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గ్రామానికి చెందిన కురుమ కృష్ణమూర్తి (23) అనే యువకుడు పిడుగు పడి శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. కృష్ణమూర్తి రోజు పనిలో మాదిరిగానే ఇంటి నుంచి తమ సొంత గొర్లను మేపడానికి వడ్డేపల్లి గ్రామ శివారులోని నల్లగుట్ట తాండ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. తిరిగి వస్తున్న సమయంలో పిడుగు పడి ప్రాణాలు కోల్పోయాడని వారు తెలిపారు. చీకటి పడుతున్నా ఎంతకి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు నల్లగుట్ట తండా అటవీ ప్రాంతంలో రాత్రి వెతకడానికి వెళ్లగా కృష్ణమూర్తి విగతాజీవిగా పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తుచేపట్టారు.



మృతి చెందిన కృష్ణమూర్తి

చేపలకు భలే గిరాకి

నవతెలంగాణ-సదాశివనగర్

మృగశిరకార్తె పురస్కరించుకొని చేపల కొనుగోలుకు డిమాండ్ నెలకొంది. మండలంలోని పలుచెరువులలో చేపలు పడుతూ అప్పటికప్పుడు విక్రయించారు. చేపల ధర బొచ్చ చాపలు కిలో 150 నుంచి 180 పలకగా, కొర్రమీన్ చేపలు కిలో 400 నుంచి 600 రూపాయలకు విక్రయించారు.



నేడే గ్రూప్-1 పరీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- పకడ్బందీగా నిర్వహించాలి :కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

గ్రూప్-1 పరీక్షకు సర్వం సిద్ధమైంది. నేడు(ఆదివారం) గ్రూప్ పరీక్షల నిర్వహణకు అధికారయంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనుండగా.. పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను 9 గంటల నుంచి 10 గంటల వరకు అనుమతించనున్నారు. 10 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించ బోరని అధికారులు ప్రకటించారు.

కాగా టీజీపిఎస్‌సి ద్వారా ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న గ్రూప్ -1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని, పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్షా కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాలని అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్.కె. డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఇన్విజిలేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉదయము 10.30 గంటల నుండి మద్యాహ్నం 01.00 గంటల వరకు పరీక్ష జరుగు తుందని, పరీక్ష రాసే అభ్యర్థులు పరీక్ష హాలుకు హాల్ టికెట్ తో పాటుగా ఆధార్ కార్డు, పాస్ పోర్ట్, పాన్ కార్డ్, ఓటరు ఐడి కార్డు, ఇతర ప్రభుత్వ ఫోటో గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి మరియు బ్లూ , బ్లాక్ బాల్ పాయింట్ పెన్ ను అనుమతించాల న్నారు. పరీక్ష కేంద్రంలో ఎవ్వరికి కూడా మొబైల్ ఫోన్‌లు అనుమతించ బడదని, చీఫ్ సూపరిండెం ట్లకు మాత్రమే అత్యవసర సేవలకు అనుమతించ నున్నట్టు తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయం పూర్తయ్యే వరకు పరీక్ష హాలు నుండి బయటకు వెళ్ళేందుకు అనుమతించవద్దని, పరీక్ష హాలును వదలి వెళ్ళే ముందు, అభ్యర్థి ఓ ఎం ఆర్ ఆన్సర్ షీట్‌ను ఇన్విజిలేటర్‌కు అందించేలా చూడాలన్నారు.

బయోమెట్రిక్ ఇన్విజిలేటర్ ద్వారా అభ్యర్థి తన బయోమెట్రిక్ ను క్యాప్చర్ చేసే వరకు పరీక్ష హాలు నుండి బయటకు అనుమతించరాదన్నారు. బూట్లు, సాక్సులు ధరించే వచ్చే వారికి అనుమతి లేదని, చెప్పులకు మాత్రం అనుమతి ఉందన్నారు. 09.00 నుండి 10.00 గంటల అభ్యర్థులను అనుమతించాలని, ఉదయం 10.00 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైననూ పరీక్ష హాలు లోనికి అనుమతించ వద్దని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రము మెయిన్ గేట్ ఉ.10.00 గం.లకు మూసి వేయాలన్నారు. పరీక్ష కేంద్రములోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైలు ఫోన్ లు, కాలిక్యులేటర్లు, చేతి గడియారాలు, బంగారు ఆభరణాలు, హాండ్ బ్యాగ్ లు, బ్లూటూత్ డివైస్ లు, పెన్ డ్రైవ్ లు, రైటింగ్ ప్యాడ్ లు, తెల్ల కాగితాలు అనుమతించరాదు అన్నారు. పరీక్ష వ్రాసే అభ్యర్థుల సౌలభ్యం కోసం, సమయాన్ని అంచనా వేయడానికి ప్రతి అరగంట పూర్తయిన తర్వాత హెచ్చరిక బెల్ మోగించాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ఏడాది పాటు మన్నికగా ఉండాలి

- విద్యార్థుల యూనిఫాంలు పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంవత్సరం పాటు మన్నికగా ఉండేలా యూనిఫామ్స్ కుట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మహిళా సంఘ సభ్యులకు సూచించారు. శనివారం కామారెడ్డి మండలం గర్గుల్, బిబిపేటలో కుట్టు శిక్షణ కేంద్రాలను సందర్శించిన ఆయన ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కుట్టుతున్న యూనిఫార్మ్ ప్రక్రియను పరిశీలించి మంచి నాణ్యతతో మన్నికగా కుడుతుందడం పట్ల మహిళా సంఘ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా యూనిఫామ్స్ కుడుతున్న మహిళలతో మాట్లాడారు. మీకు ఎన్ని యూనిఫామ్స్ ఇచ్చారు, రోజుకు ఎన్ని కుడుతున్నారు, ఇప్పటివరకు ఎన్ని కుట్టారు, ఎప్పటి వరకు పూర్తవుతాయి అని అడిగి తెలుసుకున్నారు. యూనిఫామ్స్ దుస్తులను మీ పిల్లలవి అనుకొని బాగా కుట్టాలని సూచించారు. ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టే బాధ్యతను మహిళా స్వయం సహాయక సంఘాలకు అందించిందన్నారు. దుస్తులు మన్నికగా కుట్టండని వచ్చే విద్యా సంవత్సరం కూడా మీకే దుస్తులు కుట్టే బాధ్యతను అప్పగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో 128 కేంద్రాల ద్వారా 1979 మహిళా సంఘం సభ్యులతో 77,889 దుస్తులను కుట్టిస్తున్నామని ఈనెల 11 లోగా అన్ని దుస్తులు సిద్ధం చేసి ఎంఈఓ లకు అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ అడిషనల్ పిడి మురళీకృష్ణ, ఏపీఎంలు సుధాకర్ ,సురేష్, తదితరులు పాల్గొన్నారు.



యూనిఫామ్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్



అరకొరతో అనాసక్తి..
సకాలంలో అందని జీలుగ

- ఆలస్యం కావడంతో కొనుగోలు చేయని రైతులు

నవతెలంగాణ-మాక్లూర్

పంట పొలాల్లో భూ సారాన్ని పెంచడానికి పచ్చి రొట్టె ఎరువులను వాడాలని ప్రభుత్వం జిలుగు విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందిస్తుంది. అయితే సకాలంలో రైతులకు అందించడంలో అధికారులు పాలకులు విఫలం కావడంతో ఈసారి చాలా మంది రైతులు జీలుగ విత్తనాలు నాటేందుకు ముందుకు రాలేకపోయారు. దీనికి తోడు ఈసారి జీలుగ బస్తా ధర సైతం పెరిగింది.

మండలంలో సుమారు 24 వేలకు పైగా ఎకరాల్లో ఖరీఫ్ లో వరి పంటను సాగుచేస్తు న్నారు. అయితే వరి సాగుకంటే ముందు జీలుగ విత్తనాలను వేసేవారు. కాగా ఇప్పటి వరకు మండలంలో మొత్తం సుమారు 17 వందల జీలుగ విత్తనాల బ్యాగులు మాత్రమే వచ్చాయి. ఆలస్యంగా రావడంతో వీటిని కొనడానికి రైతులు ఆశక్తి చూపడం లేదు. గతంలో జిలుగు విత్తనాలు కొనడానికి రైతు క్యూ కట్టేవారు. కానీ ఆలస్యంగా రావడంతో సమయం లేక ప్రస్తుతం వాటిని కొనుగోలు చేసే వారు కరువైయ్యారు.

గత సంవత్సరంలో జిలుగు విత్తనాలు 30 కిలోల బస్తా రూ. 833 ఉంది. ప్రస్తుతం రూ.1116 కు పెరిగింది. అంటే సంవత్సరంలో సుమారు రూ. 283 పెరిగింది. దానికి తోడు సకాలంలో రైతులకు అందుబాటులో రాలేదు. రైతులు నారు మడులు పోయాక ముందు పొలాల్లో జల్లుకునే వారు, ఇప్పుడు నారు మడులు పోసిన తరువాత సొసైటీ లోకి వచ్చాయి. దీనితో రైతులు రెండు విధాలుగా ఆలోచిస్తున్నారు. ధర పెరగడం ఒక్కటైతే, సకాలంలో జిలుగు విత్తనాలు అందుబాటులోకి రాకపోవడంతో మరొకటి.

సాగులో నూతన
టెక్నాలజీతో అధిక దిగుబడులు

- చెరుకు రైతులకు అవగాహన

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో చెరుకు రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సదాశివరెడ్డి మాట్లాడుతూ రైతులు అనునిత్యం నూతన టెక్నాలజీని తెలుసు కొని తమ వ్యవసాయానికి అనుసందానం చేసు కొని అధిక దిగుబడులను పొందాలని కోరారు. సేవ స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి రత్నాకర్ తీసుకు వచ్చినటువంటి తమిళనాడు వ్యవసాయ విశ్వవి ద్యాలయం వారు తయారు చేసినటువంటి మైక్రో న్యూట్రియన్స్ ఫర్టిలైజర్‌పై సదస్సును ఏర్పాటు చేశారు. ఒక కిలో ప్యాకెట్‌ని చెరుకు పంటకు మూడు దపాలుగా పిచికారి చేసుకున్నట్లయితే పంట దిగుబడి 20 శాతం పెరుగుతుందని అంతే కాకుండా గడల మధ్య దూరం పెరిగి అధిక బరువు తూగుతుందని చక్కర శాతం కూడా పెరుగుతుందని అన్నారు. వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ ఎఓ మల్లహరి, ఎఇఓ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ భాస్కర్, విడిసి అధ్యక్షులు ఎడ్ల నర్సింలు, సీనియర్ నాయకులు పైడి జనార్ధన్, ఆకుల సిద్ది రాములు, శేకెల్లి బాల్ రాజ్, బొలిపల్లి మహేందర్ రెడ్డి, రైతులు మర్రి పెద్ద సంగారెడ్డి, పయ్యావుల నర్సింలు, మొసర్ల రాజేందర్, తొత్తల గంగాధర్, దుబ్బాక రాజు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీఎంఆర్‌ఎఫ్ సహాయనిధి అందజేత


చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-భీంగల్‌రూరల్
మండలంలోని గోనుగొప్పుల గ్రామంలోని సాకలి గంగాజలం కొడుకు, అలాగే గొనుగొప్పుల గ్రామ హరిహర దేవాలయం పంతులు భార్య అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స చేసుకోగా.. సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాగా మంజూరైన చెక్కులను గోనుగొప్పుల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో భోజాగౌడ్, చరణ్‌గౌడ్, భోజరెడ్డి, బోర్రన్న, బోడ గంగారం, భూమేష్, బోడ గంగాధర్, రాజశేఖర్, శ్రీనివాస్, శేఖర్, మహేష్, చాకలి గంగారం, వంజరి శంకర్, కుమ్మరి శంకర్, బొప్పన్న పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ


తనిఖీ చేస్తున్న సిఐ నరేష్

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో గల వెంకటేశ్వర ఫర్టిలైజర్ దుకాణాన్ని బోధన్ రూరల్ సిఐ నరేష్, మండల వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, స్థానిక ఎస్సై ఈ.సాయన్నలు తనిఖీలు నిర్వహించారు. ఫర్టిలైజర్ దుకాణాలలో కల్తీ విత్తనాలను అమ్మవద్దని, స్టాక్ రిజిస్టర్‌లను వారు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రైతులకు అందజేసిన ప్రతి మందులకు రిసిప్ట్ తప్పనిసరిగా ఇవ్వాలని ఫర్టిలైజర్ యజమాని శివకుమార్‌ను ఆదేశించారు. స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు రైతులకు కనబడే విధంగా బోర్డుపై రాయాలని డీలర్లను ఆదేశించారు.

ఎడపల్లి బస్టాండ్ గుంతల మాయం

- ప్రయాణికులకు ఇబ్బందులు


గుంతలుగా ఉండటంతో బస్సు రాకపోకలకు ఇబ్బందులు

నవతెలంగాణ-ఎడపల్లి
ఎడపల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిజామాబాద్ - బోధన్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ బస్టాండ్‌కు అటు నిజామాబాద్ నుంచి బోధన్, బోధన్ నుంచి నిజామాబాద్ వెళ్లే ఆర్డీనరీ బస్సులు ఎడపల్లి బస్టాండ్‌లోకి వెళ్తుంటాయి. అయితే ప్రస్తుతం బస్టాండ్ ఆవరణ గుంతల మయంగా మారడంతో బస్సుల్లో ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

'సాడి వాకేథాన్'


ర్యాలీలో పాల్గొన్న మహిళలు

నవతెలంగాణ-బోధన్
హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను మరవకుండా నిరంతరం కొనసాగించాలని కోరుతూ శనివారం బోధన్ పట్టణంలో మహేశ్వరి మహిళా సంఘటన్ ఆధ్వర్యంలో 'సాడి వాకేథాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బోధన్ పట్టణంలోని శ్రీకృష్ణ మందిర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వక్తలు హిందూ సంస్కృతి సాంప్రదాయాలపై ప్రసంగించారు. అనంతరం మహేశ్వరి మహిళా సంఘటన ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. నేటి కాలంలో యువతులు ఆధునిక పోకడలను అలవాటు చేసుకుని పాశ్చాత్య ధోరణికి పాటుపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో అష్టసిద్ధ సంస్కృతి, సిద్ధ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ అక్రమాలపై విచారణ చేపట్టాలి

- పిడిఎస్‌యు డిమాండ్



మాట్లాడుతున్న కర్క గణేష్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ఎస్సీ స్టడీ సర్కిల్ అక్రమాలపై విచారణ చేపట్టాలని పిడిఎస్‌యు నిజామబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ డిమాండ్ చేశారు. నిజామబాద్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీ.డీ.ఎస్.యు.) ఆధ్వర్యంలో ఎన్.ఆర్.భవన్ కోటగల్లి ఆఫీసులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ఎస్సీ విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా డీఎస్సీ కోచింగ్ ఎస్సి టిఎస్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసిందని, కానీ ఎస్సీ స్టడీ సర్కిల్ జిల్లా అధికారి అయిన డీఎస్సీడీవో శశికళ, ఇన్చార్జి ఎస్.మారుతి, హెచ్.డబ్ల్యు నిర్వాహకన మూలంగా స్టడీ సర్కిల్ విద్యార్థులు చాలా అవస్థలు పడుతున్నారన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.75 చెప్పుకున్న నాణ్యమైన భోజనం కొరకు రాష్ట్ర ప్రభుత్వం అందించడం జరుగుతుందన్నారు. కానీ డీఎస్సీడీవో, మారుతి కక్కుర్తితో నాణ్యత లేని భోజనాన్ని పెడుతున్నారన్నారు. దాదాపు డీఎస్సీ షార్ట్ టైం కోచింగ్ కొరకు 40 మంది విద్యార్థులు మాత్రమే వస్తే 100 మంది వస్తున్నారని, భోజన బుక్స్‌కు మెటీరియల్ సంబంధించిన వాటిలో అక్రమాలు జరిగాయన్నారు. మౌలిక సదుపాయాలు, నాణ్యమైన భోజనాన్ని అందించాలని విద్యార్థులు కోరగా డీఎస్సీడీవో, ఎస్.మారుతి హెచ్‌డబ్ల్యూ విద్యార్థులపై దురుసుగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని ఎస్సీ వసతి గృహాల నాలుగో తరగతి సిబ్బందిని స్టడీ సర్కిల్ నందు విధులను కేటాయిస్తూ, వారికి బదులు బినామీ పేర్ల మీద జీతాలు నొక్కేస్తున్నారన్నారు. నియమ నిబంధనలు పాటించకుండా విద్యార్థుల వసతి కోసం స్టడీ సర్కిల్ దూరంగా ఏర్పాటు చేసి, అద్దెకు సంబంధించిన యజమాని పేరు మీద కాకుండా ఇన్చార్జి ఎస్.మారుతి, హెచ్‌డబ్ల్యూ పేరు పైన డబ్బులు డ్రా చేయడం దారుణమన్నారు. 40 మంది విద్యార్థులు వస్తే 100 మంది విద్యార్థులకు బుక్స్ కొనుగోలు చేశారని వారికి ఇచ్చినట్లు అక్విటెన్స్ సృష్టించి బిల్లులు క్లెయిమ్ చేశారన్నారు. ఇటువంటి అక్రమాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. వెంటనే జిల్లా అధికారులు, జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టి నిధులు రికవరీ చేసి డీఎస్సీడీవో శశికళ ఎస్.మారుతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే అశుర్, జిల్లా నాయకులు మహిపాల్, సందీప్, సృజన్, శివ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్తు

- బడి ఈడు పిల్లలను బడికి పంపాలి
- సూచించిన ఉపాధ్యాయులు
- కొనసాగిన బడిబాట

నవతెలంగాణ-విలేకరుల బృందం
చదువుతోనే భవిష్యత్తు ఉంటుందని, తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా బడికి పంపాలని ఉపాధ్యాయులు సూచించారు. శనివారం ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ స్కూళ్లలో వసతులపై అవగాహన కల్పించారు.

వర్ని : బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు బడికి పంపించాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సూచించారు. చందూర్ మండలం ఘన్‌పూర్ గ్రామంలో బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది పిల్లలను గుర్తించి నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఆర్.రాములు, ఇంద్రజ, మాధవీ లలిత, సిఆర్‌పి సాయిలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పని ప్రదేశంలో బడిబాట..

కమ్మర్‌పల్లి : మండలంలోని నాగపూర్ గ్రామంలో శనివారం ఉపాధిహామీ పని ప్రదేశంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. బడిబాటలో భాగంగా ఉపాధిహామీ క్షేత్రం వద్దకు వెళ్లి కూలీలకు ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా కూలీలను ఉద్దేశించి మాజీ సర్పంచ్ పాలెపు నరసయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలను కల్పిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని ఆయన కోరారు. నాగపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థానంలో ఉన్నారని గుర్తు చేశారు. అనంతరం ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను, ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థులకు అందించే సౌకర్యాలను కరపత్రాల ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్య, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాసం శ్రీనివాస్ గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఉమ, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాథోడ్ సాగర్, కోశాధికారి పాలెపు రాజేశ్వర్, మాజీ ఉపసర్పంచ్ అశోక్, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, కమ్మర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని దూపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు శనివారం బడిబాట కార్యక్రమంలో భాగంగా 8 మంది విద్యార్థుల విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్టు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు బి.వెంకటలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు మండల అధ్యక్ష కార్యదర్శులు సోమలింగం గౌడ్, సాయిరెడ్డి, ఉపాధ్యాయులు సాయన్న, రాజేశ్వర్, ప్రభాకర్, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.


వర్ని : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు


కమ్మర్‌పల్లి : ఉపాధిహామీ పనిప్రదేశంలో..


రెంజల్ : దూపల్లిలో బడిబాట..

అంగన్‌వాడీ కేంద్రాల్లో బడిబాట



బోధన్ : అంగన్‌వాడీ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహిస్తున్న దృశ్యం


బాల్కొండ : బడిబాటలో పాల్గొన్న చిన్నారులు

నవతెలంగాణ-విలేకరుల బృందం
బోధన్ : బోధన్ ప్రాజెక్ట్ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శనివారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్, గోసంబస్తి కాలనీలలో గల అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉద్యోగులు బడిబాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ జానకి పాల్గొని అంగన్వాడి పిల్లలను పాఠశాలల్లో చేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రంలో చదువుకొని ఐదు సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలను బడిబాట కార్యక్రమంలో భాగంగా సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్ చేయించారు. ఈ బడిబాటలో ఆరుగురు పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. అలాగే అంగన్వాడీలలో గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు టీకాలు ఇచ్చే కార్యక్రమాన్ని పరిశీలించినట్లు తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో అమలు చేస్తున్న కార్యక్రమాలను ఆన్లైన్ ద్వారా ప్రభుత్వానికి పంపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధిక, అంగన్వాడి టీచర్లు విక్టోరియా రాణి, సరోజ, రత్నకుమారి, ఆచన్‌పల్లిలో సూపర్వైజర్ గంగవేణి, అంగన్వాడీ టీచర్లు రేణుక, విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, కృష్ణవేణి, కాలనీవాసులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్వాడీలో చేర్పించాలి..

బాల్కొండ : మూడేండ్లు నిండిన పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్వాడీ ఉపాధ్యాయురాలు కోటగిరి లక్ష్మీనర్సు సూచించారు. బాల్కొండ మండల కేంద్రంలో శనివారం అంగన్వాడీ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు విద్యతో పాటు, పౌష్టికాహారం అందిస్తున్నామని అన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో పోషణ కార్యక్రమాలు..

ఆర్మూర్ : మండలంలోని మగ్గిడి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ వెంకట రమణమ్మ మాట్లాడుతూ అంగన్వాడికి వచ్చే పిల్లల తల్లులకు బరువుల గురించి, మూడు నుంచి ఆరు సంవత్సరాల వరకు గల పిల్లలకు అంగన్వాడి కేంద్రాల్లో నమోదు కార్యక్రమాలు చేసినట్టు తెలిపారు. బాలామృతం, గుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఆజ్మాడి, ఆశావర్కర్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని అంబేద్కర్‌నగర్ గ్రామంలో వీహెచ్ఎస్ఎన్‌డీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారుల తల్లిదండ్రుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల శారీరక మానసిక నైపుణ్యాల గురించి, అంగన్వాడీలో చిన్నారులకు లభించే పౌషకాహారం గురించి తల్లులకు వివరించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే చిన్నారుల ఎత్తు బరువులను తెలుసుకొని వారికి పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ టీచర్లను ఆదేశించారు. చిన్నారుల తల్లిదండ్రులు తమ ఇంటి పెరట్లో ఆకుకూరలు, కాయగూరలను పండించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.


ఆర్మూర్ : పోషణ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



రెంజల్ : అంబేద్కర్‌నగర్ గ్రామంలో బడిబాటపై అవగాహన

రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా తొలగించడం అన్యాయం

- ఐఎఫ్‌టియు జిల్లా4 ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్


మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా తొలగించడం అన్యాయమని ఐ.ఎఫ్.టీ.యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ అన్నారు. ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ (ఐ.ఎఫ్.టీ.యు) ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోనీ ఎన్.ఆర్.భవన్, కోటగల్లిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ.ఎఫ్.టీ.యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్.ఎస్.ఏ) వివిధ విభాగాల్లో పనిచేస్తూ 61వ సంవత్సరాల వయసు నిండిన వారిని తొలగిస్తామని ఎస్.పీ.డీ మల్లయ్యభట్టు ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముఖ్యంగా కేజీబీవీలో నాన్‌టీచింగ్ వర్కర్లు 16 ఏండ్లకుపైగా వెట్టిచాకిరి చేశారన్నారు. వీరికి కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు లేవన్నారు. ఇప్పుడు హఠాత్తుగా తొలగిస్తే వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. తొలగింపు నిర్ణయాన్ని సంవత్సరకాలం పాటు వాయిదా వేయాలన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇస్తుందన్నారు. ఎస్.ఎస్.ఏ, కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందికి 2 లక్షల రూపాయలు, వర్కర్లకు లక్ష రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రిటైర్మెంట్ అయిన వారి కుటుంబంలో ఒకరికి ఆ ఉద్యోగాన్ని కేటాయించాలన్నారు. తొలగింపు నిర్ణయాన్ని హడావిడిగా అమలు చేయాలని చూస్తే, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఐ.ఎఫ్.టీ.యు జిల్లా అధ్యక్షుడు ఎం.ముత్తెన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.రమేష్, జిల్లా నాయకులు డి.కిషన్, బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
మండలంలోని పడకల్ తండాలో ధీరజ్ (5) అనే బాలుడిపై కుక్కలు దాడిచేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. పడకల్ తండాకు చెందిన వీరేందర్ కుమారుడు ఇంటి బయట ఆడుకుంటుండగా కుక్కల దాడి చేశాయి. ఈ క్రమంలో దారి వెంబడి పడకల్ గ్రామానికి వెళ్లే పలువురు కుక్కలను తరిమివేశారు. తీవ్ర గాయాలైన బాలుడిని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పంపిణీకి సిద్ధంగా ఏకరూప దుస్తులు

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని ఐకెపి మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో తయారుచేసిన ఏకరూప దుస్తులు సిద్ధంగా ఉంచినట్లు ఏపీఎం చిన్నయ్య తెలిపారు. శనివారం టైలరింగ్ మహిళలు, వీవోఏలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలియజేశారు. మండలంలో నాలుగు గ్రామాలలో ఏర్పాటు చేసిన మహిళ టైలరింగ్ విభాగంలో మండలానికి చెందిన ఒకటి నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఏకరూప దుస్తులను పూర్తిచేసినట్టు ఆయన పేర్కొన్నారు. మరో నాలుగు రోజులలో పూర్తవుతుందని ఆయన తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు ఏకరూప దుస్తు లను అందించనున్నట్లు ఆయన పేర్కొ న్నారు.

ఇప్పటివరకు 3913 డ్రెస్సులను పూర్తి చేశామని ఆయన అన్నారు. సంబంధిత అధికారులతో త్వరలోనే ఆయా పాఠశాలలకు అప్పగించ నున్నట్టు వివ రించారు. టైలరింగ్ మహిళలు, మండల సమాఖ్య సిబ్బంది, వివోఏలు పాల్గొన్నారు.



జాతీయ లోక్‌అదాలత్‌లో 1,163 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తాన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవ అధికార సంఘం చైర్‌పర్సన్ నసీం సుల్తానా ఆధ్వర్యంలో 1,163 కేసులు పరిష్కరించారు. క్షణికావేశంలో పెట్టుకున్న కేసులను, రాజీలతో వీగిపోయే కేసులను జాతీయ లోక్ అదాలత్‌లు వినియోగించుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు ,బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శంకర్ న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు, కక్షిదారులు న్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట


బడిలో చేర్పిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో బడిబాట కార్యక్రమాన్ని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఆయా గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ శనివారం నిర్వహించారు. బడీడు పిల్లలు బడిలో చేర్చాలని, బడిబయట పిల్లలు కూడా బడిలో చేరాలని తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్య మైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన ఉంటుందని, ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్నట్లు ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

సాగుకు నీరు.. భూగర్భ జలాల వృద్ధి


పనులు పరిశీలిస్తున్న డీఈఈ

- పోచారం ప్రాజెక్టులపై రెండు చెక్ డ్యాంలు
- ఒక్కో చెక్ డ్యాం నిర్మాణంతో 250 ఎకరాలకు సాగునీరు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్


మాల్‌తుమ్మెద వద్ద కొనసాగుతున్న చెక్ డ్యాం నిర్మాణ పనులు

పోచారం ప్రాజెక్టు.. నాగిరెడ్డిపేట్ మండలానికి గుండెకాయలాంటింది. వందేండ్ల చరిత్ర కలిగిన పోచారం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండితే నాగిరెడ్డిపేట్ ఎల్లారెడ్డి రెండు మండలాలకు నీరందిస్తుంది. పోచారం ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 14.64 అడుగులు (1.820) టీఎంసీలు. వర్షాలు సమృద్ధిగా కురిసి పోచారం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండిన తర్వాత పోచారం ప్రాజెక్టు నుండి పొంగిపొర్లుతున్న నీరు నేరుగా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి చేరుతాయి. పోచారం ప్రాజెక్టు నిండిన అనంతరం వర్షాలు భారీగా కురిసి పోచారం ప్రాజెక్టు నుండి భారీగా వరద నీరు పొంగి ప్రాజెక్టులోకి చేరుతుంది. కాగా ఆ నీరును ఒడిసి పట్టేలా ప్రాజెక్టు పరిధిలో రెండు చెక్ డ్యాంల నిర్మాణం చేపట్టారు. ఒకటి పూర్తవగా, మరో చెక్ డ్యాం పది రోజుల్లో పూర్తవనుంది.

పోచారం ప్రాజెక్టు నిండిన తర్వాత పొంగిపొర్లుతున్న నీరు వృధాగా పోకుండా నాగిరెడ్డిపేట్ మండలంలో పోచారం మాల్ తుమ్మెద గ్రామాలతో పాటు మెదక్ జిల్లాలో సర్దానా ఒక గ్రామానికి సరిపడా నీరు భూగర్భ జలాలు పెంచుకునే విధంగా ఉంటుందని పోచారం ప్రాజెక్టు సరిహద్దుల్లో రెండు చెక్ డ్యామ్‌లు ఏర్పాటు చేశారు. పోచారం సర్దన గ్రామాల ఆవరణలో ఏర్పాటుచేసిన చెక్ డాం దాదాపు పూర్తయింది. మాల్ తుమ్మెద సర్దన గ్రామాల శివారులో ఆలేరు వాగుపై ఏర్పాటు చేస్తున్న చెక్ డ్యామ్ ప్రస్తుతం తుది దశకు చేరింది. చెక్ డ్యామ్‌లో నిర్మించడం వల్ల భూగర్భ జలాలు పెరగడంతో పాటు దాదాపు 250 ఎకరాలకు సరిపడు నీరు పంట పొలాలకు లభిస్తుంది. ఒక్కో చెక్ డాం 3.4 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టారు.

ఒక్కో చెక్ డ్యాంతో 250 ఎకరాలకు నీరు

డీఈఈ వెంకటేశ్వర్లు

పోచారం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండి పొంగిపొర్లుతున్న నీరు వృథా కాకుండా పోచారం ప్రాజెక్టు సరిహద్దుల్లో పారుతున్న ఆలేరు వాగుపై చెక్ డ్యామ్‌లు నిర్మించాము. దాదాపు రెండు చెక్ డ్యాముల పనులు పూర్తయ్యాయి. 15 రోజుల్లో మిగతా పనులు కూడా పూర్తవుతాయి. 250 ఎకరాలకు నీరు ఇవ్వడంతో పాటు భూగర్భ జలాలు సమృద్ధిగా పెరుగుతాయి.

ప్రైవేట్ స్కూళ్లల్లో విద్యాశాఖ ఆదేశాలు అమలయ్యేనా..?

నవతెలంగాణ-మద్నూర్

మండలంలో గల ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాశాఖ ఆదేశాలు అమలయ్యేనా అని స్థానికంగా చర్చలు నెలకొన్నాయి. మండల ప్రజలు రాష్ట్ర విద్యాశాఖ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యకు సంబంధించిన పుస్తకాలు అమ్మకాలుగాని విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫాం గాని ఇతరత్రా స్టేషనరీ వాటిని నిషేధించింది. ప్రవేట్ పాఠశాలలో పుస్తకాలు గానీ యూనిఫాంగాని స్టేషనరీకి సంబంధించిన ఎలాంటి వస్తువులైన అమ్మకాలు జరపకూడదని ఇటీవల కామారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వాహకులు ప్రతి సంవత్సరం పాఠ్యపుస్తకాలు, యూనిఫాం స్టేషనరీ రకరకాల వస్తువులు అందజేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. కానీ ఈ ఏడాది విద్యాశాఖ పకడ్బందీ చర్యలు తీసుకునేందుకు ప్రైవేట్ పాఠశాలల యజమానులకు ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేస్తుంది. ఎక్కడైనా ఏ పాఠశాలనైనా యూనిఫాం, పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు గాని అమ్మినట్లు ఫిర్యాదులు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వాలు మారినా ఎలాంటి ఆదేశాలు జారీ చేసినా ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా చదువులు వ్యాపారంగా కొనసాగిస్తూ అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తూ యూనిఫాం, పాఠ్యపుస్తకాల పేర్లతో ఎన్నో రకాల మోసాలు చేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది విద్యాశాఖ హెచ్చరికలు జారీచేసిన వాటిని ప్రైవేట్ పాఠశాలల యజమానులు కట్టుబడి పని చేస్తాయా విద్యాశాఖ ఆదేశాలను బేకాతర్ చేస్తాయా పాఠశాలలు ప్రారంభమైన తర్వాత తెలుస్తోంది. ఎందుకంటే ప్రైవేట్ పాఠశాల యజమానులు అధిక ఫీజులు వసూలు చేయడం, ఒకటి అయితే వారికి అధిక లాభాలు వచ్చే యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ వీటిని అమ్మ లేకపోతే పాఠశాలలు నడపలేని స్థితికి వస్తాయి. ప్రైవేట్ పాఠశాలల్లో ఎలాంటి వ్యాపారాలు కొనసాగకుండా రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వేధింపులు తాళలేక యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



వేధింపులు తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగిరెడ్డిపేట్ మండలంలోని బొల్లారం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై రాజు వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపేట్ మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన కోరబోయిన హరీష్ (24) గత ఆరు నెలల క్రితం అదే గ్రామానికి చెందిన అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వివాహం చేసుకున్న అనంతరం హైదరాబాదులో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత నాలుగు రోజుల క్రితం గ్రామానికి వచ్చారు. కాగా ప్రేమ పెళ్లి చేసుకున్నప్పటి నుంచి అమ్మాయి తరుపు వారు రోజూ ఫోన్ చేస్తూ తరుచూ వేదించేవారని, ఆ వేధింపులు తాళలేక తీవ్ర మనస్థాపానికి గురయ్యేవాడని, వేధింపులు తట్టుకోలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు మృతుడి కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు పంచనామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

చేపలకు భలే డిమాండ్


చేపలు కొనుగోలు చేస్తున్న పలువురు

నవతెలంగాణ-లింగంపేట్

మృగశిర కార్తిని పుష్కరించుకొని శనివారం చేపలకు భలే డిమాండ్ నెలకొంది. మృగశిర కార్తి కచ్చితంగా చేపలు తినాలని ఆనవాయితీగా వస్తున్న ఆచారం. మండలంలోని ఆయా గ్రామాల్లో ఎండలు తీవ్రమై చెరువులు ఎండికపోవడంతో నీళ్ల నిలువలేక చేపలు లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో కొన్ని గ్రామాల్లో చెరువుల్లో నీళ్ల ఉండడంతో చేపలు పట్టుకొని మండల కేంద్రానికి తీసుకు వచ్చి విక్రయించారు. కిలోకి 150 ధర పలికింది. మరి కొంతమందికి చేపలు దొరకకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి చేపలు కొనుగోలు చేసుకున్నారు. కోర మొట్టలు రూ.500కిలో చొప్పున విక్రయించారు. బంగారు తీగ, రౌట మార్పు చేపలకు డిమాండ్ బాగుందంటున్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగుల నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పండుగలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ రవీందర్ సూచించారు. బక్రీద్ పురస్కరించుకొని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండడానికి సిఐ రవీందర్ ఆధ్వర్యంలో భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ముస్లిం పెద్దలతో శాంతి భద్రతల కమిటీ సమావేశం శనివారం ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాదం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎస్‌ఐ మహేష్, నాగిరెడ్డిపేట ఎస్సై రాజు,బజరంగ్దళ్,విశ్ హిందూ పరిషత్ సభ్యులు,ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ రవీందర్

మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్‌కు సన్మానం


మున్సిపల్ వైస్ చైర్మన్ వనితను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ ఊరు దొండ వనిత - రవిని శనివారం ఆర్టీఐ, యేచ్ఆర్‌సి సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహ చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్, హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ జాతీయ లీగల్ సెల్ చైర్మన్ ఎం ఏ సలీం, జోనల్ అధ్యక్షులు సిర్నాపల్లి ప్రదీప్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ అలీముద్దీన్, కాసర్ల లింగం,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంవి భాస్కర్, జిల్లా సలహాదారులు అబ్దుల్ లతీఫ్, జిల్లా ప్రతినిధులు న్యాయవాది ఈక శ్రీనివాస్, చెట్యారి గంగ రాజ్యం, సుజిత్ పుల్లూరి, మచ్చ గంగాధర్, కే మనోజ్ కుమార్, మరికంటి స్వామి, రేకుల రవి , పట్టణ కార్యదర్శి రాధాకృష్ణ, పట్టణ మహిళా కార్యదర్శి కే జమున, పట్టణ ఉపాధ్యక్షురాలు సాగర భాను పాల్గొన్నారు.

పర్మళ్లల్లో ఎడ్లబండ్ల ప్రదర్శన


వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పరమళ్ల గ్రామంలో గ్రామదేవతలకు ఎడ్లబండ్ల ప్రదర్శనను శనివారం నిర్వహించామని గ్రామస్తులు తెలిపారు. గ్రామ దేవతల ఉత్సవాల్లో భాగంగా ఎడ్లబండ్లను అలంకరించి గ్రామ దేవతలైన ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మ, దుర్గమ్మ, పోలేరమ్మ, పెద్దమ్మ ఆలయాల చుట్టు ఐదుసార్లు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు ఓడి బియ్యం పోసి మొకలు తీర్చుకున్నారు. ఎడ్లబండ్ల ప్రదర్శనను పోటా పోటీగా నిర్వహించారు.

నేటి నుంచి సజ్జనపల్లిలో గ్రామ దేవత ఉత్సవాలు

మండలంలోని సజ్జనపల్లి గ్రామంలో ఆదివారం నుంచి గ్రామ దేవతల ఉత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రామస్థులు తెలిపారు. ఆదివారం అన్ని కులాల వారు గ్రామదేవతలైన పోలేరమ్మ, దుర్గమ్మ, ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మలకు బోనాలు తీయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సోమవారం ముదిరాజ్ కులస్తులు వారి ఆరాధ దైవమైన పెద్దమ్మకు బోనాలు తీయడం జరుగుతుందన్నారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి కుస్తీ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కుస్తీ పోటీల్లో విజేతలకు మూడు తులాల వెండి కడియాన్ని బహుకరిస్తామన్నారు. ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఆలోచన మీది-ఆచరణ నాది

- ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రాజారెడ్డి కళ్యాణమండపంలో నేడు (ఆదివారం) కామారెడ్డి పట్టణ అభివృద్ధి పై ఆలోచన మీది, ఆచరణ నాది అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 9న, ఆదివారం, ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి కామారెడ్డి పట్టణ అభివృద్ధికై పట్టణ వ్యాపారస్తులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై పట్టణ అభివృద్ధికి సూచనలు సలహాలు అందించాలని కోరారు.

ఏ సమస్య ఉన్నా చెప్పండి.. పరిష్కరిస్తా

- మీరు బాగుంటేనే కామారెడ్డి బాగుంటుంది
- కార్మికులతో మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి


కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

'ఏ సమస్య నాతో చెప్పండి. వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. మీరు బాగుంటేనే కామారెడ్డి బాగుంటుందని' మున్సిపల్ చైర్మన్‌గడ్డం ఇందుప్రియ మున్సిపల్ కార్మికులతో అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 5 గంటల ప్రాంతంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మున్సిపల్‌లో వివిధ కేటగిరిలో పని చేస్తున్న సిబ్బందితో క్షేత్ర స్థాయిలో ఉన్నటువంటి సమస్యల గురించి కార్మికులను అడిగి తెలుసుకున్నారు. మీ పనులకు సంబంధించిన పనిముట్లు లేనట్లయితే వాటి వివరాలను నాకు తెలుపాలని తొందర్లో వాటిని తెప్పించే ఏర్పాట్లు చేస్తానన్నారు. అనంతరం కార్మికులకు, కామారెడ్డి పట్టణ ప్రజలకు మృగశిర కార్తి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, కామారెడ్డి పట్టణ కౌన్సిలర్, పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్

జిల్లా ఎస్పీ సింధు శర్మాని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందు ప్రియా మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఇందుప్రియ మాట్లా డుతూ.. కామారెడ్డిలోని శాంతి భద్రత గురించి, ట్రాఫిక్ సమస్యల గురించి చర్చించారు. ఎస్పీ సానుకూలంగా స్పందించి శాంతిభద్రతలను, ట్రాఫిక్ సమస్యలను అధికమిస్తామన్నారు. కార్యక్రమంలోని కామారెడ్డి పట్టణ కౌన్సిలర్, పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఎక్కడిచెత్త అక్కడే

- అధికారుల పాలనలో గ్రామాల్లో అపరిశుభ్రత
- పంచాయతీ పాలకవర్గాలు లేక ఇబ్బందులు

నవతెలంగాణ-మద్నూర్


గ్రామంలో పేరుకుపోయిన చెత్త.. లోపించిన పారిశధ్యం

మండలంలోని మద్నూర్, డోంగ్లి, మండలాల పరిదిలో మొత్తం 34 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో అధికారుల పాలన కొనసాగుతుంది. అధికారుల పాలనలో గ్రామాల్లో అపరిశుభ్రత పెరిగిపోతున్నప్పటికీ అధికారుల పనితీరు పట్టింపు లేక పంచాయతీ పాలకవర్గాలు లేకపోవడం ఉమ్మడి మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్పంచుల పదవీకాలం ముగియగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిస్తూ వస్తుంది. ఈ మధ్యకాలంలో పార్లమెంట్ ఎన్నికల్లో దాదాపు రెండు మాసాలు గ్రామ ప్రత్యేక అధికారులు గ్రామపంచాయతీ అధికారులు ఎన్నికల బిజీలోనే కొనసాగారు. గ్రామాల శుభ్రత పట్ల అధికారుల పాలన నిర్లక్ష్య వైఖరి కొనసాగడం పట్ల అపరిశుభ్రత గ్రామాల్లో పెరిగిపోతుంది. దీనికి నిదర్శనం మండల కేంద్రంలోని మద్నూర్ నడి ఒడ్డున హనుమాన్ మందిర సమీపంలో రోడ్డుపై నుంచి మురికి నీరు పారుతూ వస్తున్నాయి. మురికి నీటి నుండే ప్రజలు రాకపోకలు జరుపుతు న్నారు. ఆలయానికి వచ్చే పూజారుల, భక్తులు కూడా మురికి నీటి నుంచి వెళ్లవలసిన దుస్థితి కొనసాగుతుంది. ఒకపక్క గ్రామాల్లో అపరిశుభ్రత పెరిగిపోతుంటే మరోపక్క పారిశుధ్య కార్మికులకు 6, 7 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం పారిశుధ్య కార్మికులు జీతాలు అందక ఆందోళన చెందుతున్నారు. ఇటీవల మండల కేంద్రంలో జిల్లా పంచాయతీ అధికారి డివిజనల్ పంచాయతీ అధికారి గ్రామపంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించి అపరిశుభ్రత లేకుండా తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ గ్రామాల్లో అపరిశుభ్రత నివారించడంలో ప్రత్యేక అధికారుల పాలన ఏ మాత్రం చొరవ చూపడం లేదని ప్రజల్లో ఆవేదన వ్యక్తం అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనలో అపరిశుభ్రత పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కాలేజీ ఇచ్చారు.. సిబ్బందిని మరిచారు

- ఇంటర్‌లో విద్యార్థుల ప్రవేశాలు లేవని అధ్యాపకుల నియామకం విస్మరణ
- అధ్యాపకులు లేరని జూనియర్ కాలేజీవైపు చూడని విద్యార్థులు
- ఈసారైనా గాడిలో పడేనా..?


ప్రభుత్వ కాలేజీకి కేటాయించిన జడ్పీహెచ్‌ఎస్ బిల్డింగ్

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ కళాశాలకు బోధన సిబ్బందిని మంజూరు చేయాలని విద్యార్థులు, ప్రజలు కోరుతునారు. గత విద్యా సంవత్సరం 2022-23 సంవత్సరంలో ఎంపీసీ, బైపిసి, సిఇసి, ఎచ్ఈసి గ్రూపులలో మొత్తంగా ఆరు అడ్మిషన్లు జరిగాయి. కానీ ఈ కళాశాలలో బోధన సిబ్బంది లేక ఆ విద్యార్థులను పిట్లం జూనియర్ కళాశాలకు బోధన కోసం పంపారు. ఈ క్రమంలో విద్యార్థులు పిట్లం కళాశాలకు వెళ్లక ఇంటి నుంచే చివరి పరీక్షలు రాశారు. ఈ తరుణంలో ఈ విద్య సంవత్సరం కూడా కళాశాలకు ఎలాంటి సిబ్బంది లేకపోవ డంతో విద్యార్థులు కళాశాల వైపు మొగ్గుచూపడం లేదు.

కళాశాలకు ఇంచార్జి ప్రిన్సిపాల్‌గా గత సంవత్సరం పిట్లం కళాశాల ప్రిన్సిపాల్ విజయనందరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

నిజాంసాగర్ కళాశాలలో ఒక్క సిబ్బంది కూడా లేకపోవడంతో కళాశాల మూతపడి ఉంది. కళాశాల జూన్ 1 నుంచి ప్రారంభం అవ్వగా ఇప్పటివరకు కళాశాల తెరిచిందేలేదు. ఇప్పటివరకు ఒక్క అడ్మిషన్ కూడా కళాశాలలో జరగలేదని ప్రిన్సిపల్ తెలిపారు. కళాశాలకు ప్రత్యేక భవనం కూడా లేదు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్నటువంటి ఖాళీ భవనాన్ని కళాశాలకు మంజూరు చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కళాశాలకు బోధన సిబ్బందిని మంజూరు చేయించి, కళాశాలను సద్వినియోగం చేయాలని మండలంలోని విద్యార్థులు ప్రజలు కోరుకుంటున్నారు. గత ప్రభుత్వ హయంలో మంజూరైన కాలేజ్ ఇప్పటి ప్రభుత్వమైన కొనసాగిస్తుందా కొనసాగిస్తే వెంటనే కళాశాలకు పక్కా భవనం బోధన సిబ్బంది మంజూరు చేయిస్తుందా వేచి చూడాల్సిందే.

మృగశిర కార్తె ప్రారంభం

● గ్రామాల్లో జోరుగా చేపల విక్రయం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలో మృగశిర కార్తెను పురస్కరించుకొని శనివారం బోయ కులస్తులు చెరువులలో చేపలు పట్టి విక్రయించారు. మృగశిర కార్తె సందర్భంగా చేపలు కొనుగోలు చేసేందుకు ప్రజలు పోటీపడ్డారు. మండల కేంద్రానికి చెందిన బోయ కులస్తులు ఉదయం నాలుగు గంటల నుంచి చెరువులలో చేపలు పట్టి తీసుకురాగా, క్రయవిక్రయాలు జోరుగా కొనసాగాయి. మృగశిర కార్తె నుంచి వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులు దుక్కులు దున్ని వ్యవసాయ పనులలో నిమగ్నమవుతారు.



చేపలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండలంలోని సాయి భూపేట ప్రాథమిక పాఠశాలలో 2003-2004 ఐదవ తరగతి చదివిన విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల తర్వాత ఒకచోట కలవడంతో నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యా బోధన చేసిన గురువులను శాలువాలతో సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జంగం అశోక్, మాణిక్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

కల్లుబట్టి వద్ద యువకుడిపై కత్తితో దాడి



గాయాలపాలైన గంగాధర్

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల కల్లుబట్టి వద్ద గంగాధర్(38) అనే వ్యక్తిపై జీవన్‌సింగ్ అనే వృద్ధుడు ఘర్షణపడి క్షణికావేశంలో కత్తితో దాడి చేసినట్లు బోధన్ పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పాండుతర్ప కాలనీకి చెందిన గంగాధర్ బోధన్ పాతబస్టాండ్ వద్దగల కల్లుబట్టిలో నుంచి బయటకు వచ్చే క్రమంలో జీవన్ సింగ్ అనే వృద్ధుడిని ఎదురుపడి తగలడంతో జీవన్ సింగ్ అనే వృద్ధుడు కిందపడ్డాడు. ఈ క్రమంలో ఒకరికొకరికి మాట మాట పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో జీవన్ సింగ్ తన వద్ద ఉన్న కత్తితో క్షణికావేశంలో గంగాధర్ మెడపై దాడి చేశాడు. దాంతో అతనికి తీవ్ర రక్తస్రావం కావడంతో సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జీవన్‌సింగ్ జీవనోపాధి కోసం కత్తులు తయారుచేసి విక్రయిస్తుంటాడు. బాధితుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు వితరణ



క్రీడాకారులకు ఆర్ఆర్ ఫౌడేషన్ ద్వారా క్రీడా దుస్తులు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్ఆర్ ఫౌండేషన్ తరుపున బహ్రెయిన్‌లో హైదరాబాద్ యువకుల క్రికెట్ జట్టుకు క్రీడా దుస్తులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ రాజురెడ్డి మాట్లాడుతూ.. విదేశాల్లో ఉన్న వారికి ఇబ్బంది ఉందని చెప్పిన వెంటనే ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా కానీ వివిధ సంస్థల ద్వారా సహాయం జరిగేలా స్పందిస్తారని తెలిపారు. ఇటీవల చనిపోయిన వారి మృతదేహాలను గల్ఫ్ దేశాల నుంచి రాకేష్‌రెడ్డి వారి సొంత గ్రామాలకు చేర్చారని ఫౌండేషన్ ద్వారా విదేశాల్లో సైతం సేవ కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు.

శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో కుంకుమార్చన



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నవతెలంగాణ-మోపాల్

బోర్గాం శివారులో గల శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో శనివారం శ్రీ మహాలక్ష్మి యాగన్ని వేద పండితులు సమక్షంలో రెండవ రోజున వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలు మూడు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు లక్ష్మీ గణపతి ఆలయ వ్యవస్థాపకులు అరుణ్ శర్మ తెలిపారు. అలాగే శ్రీ శారద పీఠాధిశ్వర్లు భారతి తీర్థ స్వామి విధుశేఖర భారతి తీర్థ మహా స్వాముల దివ్య ఆశీస్సులతో వేద పండితుల సహకారంతో సూక్త పారాయణం తర్పణములు, శ్రీ సూక్త యజ్ఞం, శ్రీ చక్రానికి కుంకుమార్చనలు రెండవ రోజు శనివారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే అన్నదానం సైతం చేపట్టారు. కార్యక్రమంలో లవుచెట్టి శ్రీనివాస్, గజవాడ ఆగమయ్య, చిట్టిమిల్లి హరిప్రసాద్, బెజవాడ నరేందర్, పవన్ కేడియా, బెజవాడ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా ఒకరు మృతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మారం.బి గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ (32) అనుమానాస్పదంగా మృతిచెందినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం సమయంలో బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ధర్మారం.బి ఎమ్మెస్సార్ బార్ పక్కనగల ఖాళీ స్థలంలోని ఓ చెట్టు కింద మృతదేహం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ప్రేమ్‌కుమార్‌కు నాన్న అయిన శకటం మురళి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం తన కుమారుడిదిగా గుర్తించారు. మృతిపై అనుమానం ఉందని, విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై మహేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు



మృతి చెందిన ప్రేమ్‌కుమార్

నీట్ పరీక్షలో ఎన్‌టీఏ వైఫల్యం

● ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు గణేష్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నీట్ పరీక్ష నిర్వహణలో ఎన్‌టీఏ వైఫల్యం కారణంగా నష్టపోయిన విద్యార్థులందరికీ న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు గణేష్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన నీట్ పరీక్షను రద్దుచేసి, తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆ జిల్లా కార్యాలయంలో శనివారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు గణేష్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షల్లో దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు ఆల్ ఇండియా స్థాయిలో టాప్ ర్యాంకు వచ్చిందని ఈ పరీక్షల ఫలితాలను జూన్ 14న విడుదల చేస్తామని చెప్పి, ఎలక్షన్ ఫలితాల రోజునే విడుదల చెయ్యటంలో ఆంతర్యం ఏమిటోనని అన్నారు. ఎవరి ప్రయోజనాల కోసం ఈ పరీక్షను నిర్వహించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. అలాగే 2021, 2022, 2023 ఆయా సంవత్సరాలలో నిర్వహించిన నీట్ పరీక్షల్లో ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులకు మాత్రమే మొదటి ర్యాంకు వచ్చిన పరిస్థితి ఉందని, 2024లో నిర్వహించిన నీట్ పరీక్షల్లో 67 మందికి మొదటి ర్యాంకు ఏ రకంగా వస్తుందని ప్రశ్నించారు. అలాగే ఒకే పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసినటువంటి ఆరుగురు విద్యార్థులకు మొదటి ర్యాంకు రావడం చూస్తుంటే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. విద్యార్థులకు ప్రశ్నాపత్రాలు ఇవ్వడంలో మాత్రం 20 నిమిషాలకు పైగా ఆలస్యం చేసి, ఆలస్యం అయిన 20 నిమిషాల కొరకు 40 గ్రేస్ మార్కులుగా కలిపి, కష్టపడి చదివిన విద్యార్థులకు అన్యాయం చేస్తూ ఎన్‌టిఏ వ్యవహరించిన తీరు సరికాదన్నారు. అదేవిధంగా ఇలా ఎన్‌టిఏ నిర్వహించిన నీట్ పరీక్షల్లో కొంతమంది ప్రయోజనాల కొరకు అనేకమంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతుందని, దీని కారణంగా కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు కూడా చేసుకున్న ఘటనలు జరిగిన ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ స్పందించి ఈ సంవత్సరం ఎన్‌టిఏ ఆధ్వర్యంలో నిర్వహించిన నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జిచే విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు వేణు సంతోష్, యకులు రాజు, మారుతి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు గణేష్

రామోజీరావుకు నివాళి



నిజామాబాద్ సిటీ: రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించిన పలువురు



ఆర్మూర్‌లో...

నవతెలంగాణ-బోధన్

ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు శనివారం అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన మృతిపట్ల తెలుగుదేశం పార్టీ బోధన్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు అభిమానులు శనివారం బోధన్ పట్టణంలో సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలుగుజాతికి, పత్రిక రంగంలో జర్నలిజానికి రామోజీరావు చేసిన సేవలను కొనియాడారు. నిబద్ధతతో కూడిన జర్నలిజాన్ని ఐదు దశాబ్దాలుగా కొనసాగించటం గర్వకారణమన్నారు. అన్నివర్గాల పార్టీలకు చెందిన వార్తలను ప్రజలకు యధావిధిగా అందజేసి తన నిబద్ధతను చాటుకున్నారని కొనియాడారు. పత్రికా రంగంతోపాటు వివిధ వ్యాపార సంస్థలను నెలకొల్పి వేలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన ఘనత రామోజీరావుదేనని అన్నారు. జర్నలిజంలో నూతన ఒరవడి సృష్టించి సామాజిక అంశాలతో పాటు ప్రజలను చైతన్యపరిచే విధంగా కథనాలను ప్రచురించడం ఈనాడు ప్రజలకు అందించిన చైతన్యమని తెలియజేశారు. సామాజిక ఉద్యమాలు తెలుగు నేలపై పురుడు పోసుకొని తమ ఆకాంక్షల మీద ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడానికి సహకరించాయని అన్నారు. పత్రికలు భవిష్యత్తులో కూడా ఇదే ప్రమాణాలు పాటించాలని అభిప్రాయపడ్డారు. రామోజీ ఆశయాలను కొనసాగించడమే మనం ఆయనకిచ్చే ఘనమైన నివాళి అని వారు పేర్కొన్నారు. ఈ సంతాప సమావేశంలో తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి న్యాయవాది, సిహెచ్‌వి హనుమంతరావు, ఉపాధ్యక్షులు పావులూరు వెంకటేశ్వరరావు, బోధన్ నియోజకవర్గ ఇన్చార్జ్ కోట గోపాల్‌రెడ్డి, తెలుగు యువత నాయకులు రావెళ్ల శ్రీనివాస్, తెలుగు విద్యార్థి నాయకులు సచిన్ పటేల్, పార్టీ నాయకులు విఠల్ పటేల్, కృష్ణారెడ్డి, రవికుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ : తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. అంబిక సత్యనారాయణ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా అర్బన్ ఇంఛార్జి వినోద్ కుమార్ పాల్గొని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనాడు పత్రికను స్థాపించి తెలుగువాళ్ళ ఇళ్లల్లో ఒక నిత్యావసర వస్తువుగా మార్చిన వ్యక్తి అని, తెలుగు పత్రికలను గ్రామ స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి అని కొనియాడారు. పట్టు పట్టగ రాదు, పట్టి విడువగరాదు అనే సూత్రానికి ప్రతీక ఆయన అని అన్నారు. కార్యక్రమంలో శంకర్ ముదిరాజ్, కొయేడి నర్సింలుగౌడ్, బొబ్బ నరసింహరావు, లవంగ రాజు, మల్లారెడ్డి, ఫిరోజ్, హరీష్, గాంగోనే రాజేశ్వర్, విష్ణు, బాలాజీ గౌడ్, సల్ల సత్య నారాయణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్: పత్రికా రంగంలో కొత్త పుంతలు తొక్కించి, తనదైన ముద్ర వేసిన అక్షర యోధుడు, రామోజీగ్రూప్ సంస్థలు, ఈనాడు పత్రిక చైర్మన్ రామోజీరావుకు శనివారం పట్టణంలో జర్నలిస్టులు అశ్రునివాళ్లు అర్పించారు. గత కొన్ని దశాబ్దాలుగా పత్రిక రంగంలో ఆయన చేస్తున్న సేవలకు కేంద్ర ప్రభుత్వం రెండో అత్యున్నత పురస్కారం పద్మ విభూషణ్ గతంలోనే ప్రధానం చేసిన సంగతి తెలిసిందే. ప్రతి తెలుగు వాడి నాడీ పట్టుకుని ఉషోదయపు వెలుగులు పంచాలని ఆయన చేసిన కృషి నిర్విరామమని జర్నలిస్టులు కొనియాడారు. పత్రికా రంగంలో ఆయన అవలంబించిన విధానాలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ జర్నలిస్టులు నెమలి ప్రశాంత్, పుట్టి మురళీ, కలిగోట చిన్న మనోహర్, సంజీవ్, సందీప్, క్రాంతి, దినేష్, వినోద్, చేతన్, రాకేష్, రితీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి పట్ల ఎల్లారెడ్డి పాత్రికేయులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో శనివారం నాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఎల్లారెడ్డి పాత్రికేయులు రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. రామోజీరావు మృతి పత్రిక రంగానికి తీరని లోటు అని అడ్వకేట్ పండరి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల పాత్రికేయులు పాల్గొన్నారు.



బోధన్‌లో...

10న ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ

● ఎంఈఓ గణేష్‌రావు

నవతెలంగాణ-రెంజల్

మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 10న ప్రభుత్వ పాఠశాలలో చదివి విద్యార్థిని విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, ఉచిత నోటు పుస్తకాలను అందజేయనున్నట్టు మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ రజిని కిషోర్, జడ్పిటిసి మేక విజయ సంతోష్, ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్‌రావు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయం 10 గంటలకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రయివేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

● ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్



మందులను పరిశీలిస్తున్న అధికారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రయివేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాలని ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ తెలిపారు. శనివారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశానుసారం ప్రైవేట్ హాస్పిటల్‌ను మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ప్రైవేట్ హాస్పిటల్‌లో గల సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రైవేట్ హాస్పిటల్‌లో ఖచ్చితంగా బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్‌ను కలిగి ఉండాలని, అగ్నిమాపక కార్యాలయం నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుందని సూచించారు. హాస్పిటల్‌లోని డయాగ్నస్టిక్ ల్యాబ్, డిజిటల్ ఎక్స్‌రేలను పరిశీలించారు. అలాగే మెడికల్ షాపులో గల మందులను పరిశీలించి.. ప్రతి మెడిసిన్‌కు బ్యాచ్ నెంబర్, ఎక్స్‌పయిరీ డేట్‌ను ఖచ్చితంగా ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. హాస్పిటల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు.

కల్తీఫుడ్‌పై అధికారుల కొరడా..

● నగరంలోని పలు హోటళ్లల్లో తనిఖీలు



రెస్టారెంట్‌లోని ఫుడ్‌ను చెత్తబుట్టలో పడేస్తున్న ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్రంలోని రెస్టారెంట్లలో కల్తీఫుడ్‌పై అధికారులు కొరడా ఝులిపించారు. ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు, కంట్రోలర్ నగరంలోని పలు హోటళ్లపై దాడులు నిర్వహించారు. నగరంలోని హైదరాబాద్ రోడ్డు వద్ద గల అరోమా రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. అరోమా రెస్టారెంట్ వంటశాలను పూర్తిగా పరిశీలించారు. ఈ దాడిలో నిలువ ఉంచిన చికెన్, ఫిష్ మాంసం, కలరు వాడిన బిర్యానీని అధికారులు స్వాధీనం చేసుకుని చెత్తబుట్టలో వేశారు. అదేవిధంగా నగరంలోని పలు రెస్టారెంట్లను సైతం అధికారులు తనిఖీలు చేపట్టారు.

మలబార్‌లో గాజులు, చైన్ మేళా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మలబార్ గోల్డ్, డైమాండ్స్ నిజామాబాద్‌లో గాజులు, చైన్ మేళా నిర్వహిస్తున్నామని ప్రముఖ అంతర్జాతీయ ఆభరణాల వ్యాపార సంస్థ అయిన మలబార్ గోల్డ్, డైమాండ్స్ నిజామాబాద్ బ్రాంచ్ మేనేజర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 7 నుంచి 16 వరకు నిజామాబాద్ షోరూములో "గాజులు, చైన్ మేళా"ను నిర్వహిస్తోందని, ఆభరణాల ప్రియులకు ప్రపంచ స్థాయి ఆభరణాల షాపింగ్ అనుభూతిని ఆస్వాదించేలా, కేవలం 4.9 శాతం నుండి సహేతుకమైన వేల్యూ ఎడిషన్‌తో హెచ్‌యుఐడి హాల్మార్క్ చేయబడిన అద్భుతమైన చైన్లు, గాజులు విస్తృత శ్రేణిలో మీకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. టైమ్‌లెస్ క్లాసిక్స్ నుండి సమకాలీన డిజైన్ల వరకు, సున్నితమైన, సొగసైన గొలుసులు, ముఖ్యంగా రోజువారీ ధరించే చైన్లు, గాజులు ఈ మేళాలో ప్రదర్శించబడతాయని వివరించారు. ప్రతి ఆభరణం పరిపూర్ణంగా రూపొందించబడి, మలబార్ అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఆభరణాల ధరల విషయంలో పారదర్శకత పాటించడంలో మలబార్ గోల్డ్, డైమాండ్స్ ప్రసిద్ధి చెందిందని, వన్ ఇండియా వన్ గోల్డ్ రేట్ స్కీమ్‌ను ప్రవేశ పెట్టడం ద్వారా దేశంలోని అన్ని షోరూముల్లో బంగారానికి ఏకరీతి ధరను నిర్ధారిస్తుందని తెలిపారు. రాయి బరువు, నికర బరువు, ఆభరణాల తయారీ ఛార్జీని సూచించే పారదర్శక ధరల పట్టిక, ప్రతి ఆభరణానికి ఉంటుందని, ఆభరణాలకు జీవితకాల ఉచిత నిర్వహణ హామీ, పాత బంగారు ఆభరణాలను తిరిగి విక్రయించేటప్పుడు మీ బంగారం, వజ్రాలపై అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ 28 పాయింట్ల తనిఖీ, బైబ్యాక్ హామీ, ఆభరణాలకు ఉచిత బీమా, బాధ్యతాయుతమైన మూలాల నుంచి బంగారం సేకరణ, న్యాయమైన కార్మిక విధానాలు పాటించడం మొదలైనవి ఈ వాగ్దానాలలో భాగంగా ఉన్నాయని తెలిపారు. ప్రముఖ భారతీయ వ్యాపార సంస్థ మలబార్ గ్రూపు కంపెనీ, మలబార్ గోల్డ్, డైమాండ్స్‌లో భారతదేశం, ఆస్ట్రేలియా, కెనడా, యూకే, యూఎస్ఏ, దేశాల్లో బలమైన రిటైల్ నెట్వర్క్ కలిగియుందని తెలిపారు.



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నివాళి

నవతెలంగాణ-ఆర్మూర్



రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రామోజీరావుకు శనివారం నివాళు లర్పించారు. అధ్యక్షులు పట్వారి గోపికృష్ణ మాట్లాడుతూ.. అక్షర సూర్యుడు, రచయిత, నిర్మాత, మార్గదర్శకుడు, దినపత్రికల సారథుడు సినీనిర్మాత రామోజీరావు అని అన్నారు. అలాంటి మహనీయుడు లేకపోవడం తీరనిలోటని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పట్వారీ తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షులు పుష్కర్ రావు, ఖందేశ్ సత్యం, కాలనీవాసులు, పట్టణ ప్రజలు నివాళులర్పించారు.

శనివారంతో జోరు తగ్గిన చేపల విక్రయాలు

నవతెలంగాణ-ఆర్మూర్

మృగశిర కార్తె నాడు చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఈ ఏడాది మృగశిర కార్తె శనివారం నాడు రావడంతో చేపల విక్రయాలు ఆశించినంతగా జరగలేదని చేపల విక్రయదారులు తెలిపారు. ఈ ఏడాది మృగశిర కార్తె శనివారం రావడంతో ఒకరోజు ముందుగానే చేపల విక్రయాలు జరిగినట్టు విక్రయదారులు తెలిపారు. కాగా పట్టణం చేపల ధర కిలో రూ.160 ఉందని వివరించారు.



చేపల విక్రయం

బస్సుల కోసం ఉరుకులు పరుగులు

- బస్సులు లేక.. సమయానికి రాక
- గంటల తరబడి నిరీక్షణ

నవతెలంగాణ-లింగంపేట్



లింగంపేట్‌లో బస్సు ఎక్కేందుకు గూమిగూడిన ప్రయాణికులు



కామారెడ్డి బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసింది. ఉచిత ప్రయాణం కోసం మహిళలు, వృద్ధులు చిన్న పెద్ద తేడా లేకుండా ఉరుకులు పరుగులు పెడుతున్నారు. బస్సులు లేక సమయానికి చేరక గంటల తరబడి బస్టాండ్లలో ప్రయాణం చేయడానికి నిరీక్షిస్తున్నారు. అంతేకాకుండా ప్రమాదం అంచున ప్రయాణిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం వినియోగించడానికి వృద్ధులు, మహిళలు, చిన్నారులు సైతం ఆసక్తి చూపుతున్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా బాన్సువాడ, కామారెడ్డి బస్ డిపోలున్నాయి. కామారెడ్డి డిపో పరిధిలో మొత్తం 217 బస్సులున్నాయి. ఇందులో పల్లె వెలుగు 97 ఉన్నాయి. డీలక్స్ 19, సూపర్ లగ్జరీ 8, ఎక్స్‌ప్రెస్‌లు 28, అద్దె బస్సులు 53 ఉన్నాయి. రోజువారి బస్సుల ప్రయాణం 80 కిలోమీటర్ల పైగా రోజు తిరగాల్సి ఉంది. ప్రస్తుతం 421 గ్రామాలకు బస్సు సౌకర్యం ఉంది. రోజుకు మహిళలు 65 వేలపైగా ప్రయాణిస్తున్నారు. బస్సుల కోసం మహిళలు గంటల తరబడి నిరీక్షిస్తున్నాయినప్పటికిని ఉచిత బస్సును సద్వినియోగం చేసుకుంటున్నారు. బస్సులో 65 మందికి పైగా ప్రయాణించాల్సి ఉండగా 120 మందికిపైగా మహిళలు ప్రయాణిస్తున్నారు. బస్సులో కూర్చోవడానికి సీట్లు లేకపోవడంతో జనంలో ఊపిరి ఆడక గాలి రాక సతమతమవుతున్న అయినప్పటికిని ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. అడుగడుగునా స్టేజీలు ఉండడంతో గంటలో గమ్యం చేయాల్సిన గంటన్నర ఆలస్యం అవుతుంది. ఇందులో 90 శాతం మహిళలు ఉంటే 10 శాతమే పురుషులు బస్సులో ప్రయాణిస్తున్నారు.

బస్సులు లేక సమయానికి రాక..

బస్సులు సమయానికి రాకపోవడం వల్ల ప్రయాణికలు, ఉద్యోగ మహిళలు, పురుషులు సమయానికి చేరలేకపోతున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగులు, పురుషులు సైతం ఉదయాన్నే బస్సుల కోసం వేచి చూస్తున్నారు. బస్సు సమయానికి రాకపోవడం వల్ల రెండు బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు కేవలం ఒకే బస్సులో ప్రయాణించడంతో అడుగడుగునా స్టాప్‌లు ఉండడంతో సరైన సమయంలో కార్యాలయాలకు చేరుకోలేకపోతున్నారు. ఎల్లారెడ్డి మున్సిపల్ కేంద్రం నుంచి ఉదయం కామారెడ్డి జిల్లా కేంద్రంలో వెళ్లే ఉపాధ్యాయులు ప్రభుత్వ ఉద్యోగులు ఏడు గంటలకు బస్సు కామారెడ్డికి వెళ్తే గంట పాటు 8 గంటలకు వస్తుంది. గంట వ్యవధిలో వందల మంది మహిళలు, ప్రజలు, ఉద్యోగులు బస్సు కోసం నిరీక్షిస్తున్నారు. కార్యాలయాలకు సమయానికి చేరుకోకపోవడంతో ప్రతిరోజు ఉన్నతాధికారులకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. లింగంపేట్ నుంచి ఉదయం 6 గంటలకు బస్సు వెళ్తే గంట వరకు ఏడు గంటలకు కామారెడ్డికి బస్సు ఉంది. ఎనిమిది గంటలకు బస్సు ఉంది. దీనితో దూర ప్రాంతాలకు వెళ్లేవారు ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసేవారు ప్రైవేట్ కార్యాలయంలో పనిచేసే బస్సులు సమయానికి రాకపోవడంతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. కొంతమంది చేసేదేం లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కామారెడ్డి నుంచి సాయంత్రం 6 గంటలకు నిజాంసాగర్ బస్సు వెళితే ఏడు గంటలకే బస్సు ఉంది. గంట వ్యవధిలో మూడు బస్సుల సరిపోయే జనం బస్టాండ్‌ల బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. గంట గంటకు బస్సు నడపడంతో ఒకే బస్సులో 160పైగా మంది మహిళలు, వృద్ధులు పిల్లలు పరిమించడంతో ఫుట్ బోర్డ్‌పై నిలబడి ప్రయాణిస్తున్నారు. విద్యాసంస్థలు ప్రారంభమైతే ఒకవైపు విద్యార్థులు మరోవైపు ఉపాధ్యాయులు ప్రయాణిస్తారు. పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని బస్సుల్లో ప్రయాణించడం కష్టంగా మారుతుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెడికవర్ ఆసుపత్రిలో బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న న్యూరోసర్జన్

ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఆసుపత్రి న్యూరో సర్జన్ కృష్ణాదిత్య మాట్లాడుతూ.. బ్రెయిన్‌లోని కణితుల సమీపంలో కణజాలం, నిర్మాణాలలో వచ్చే గడ్డలు, కణాల పెరుగుదలనే బ్రెయిన్ ట్యూమర్స్ అంటారన్నారు. వీటిలో కొన్ని కాన్సర్‌తో సంబంధం లేనివని, మరికొన్ని కాన్సర్‌తో సంబంధం ఉన్నాయని అన్నారు. బ్రెయిన్ ట్యూమర్ సమస్య రోజురోజుకూ పెరుగుతోందని దీర్ఘకాలం పాటు రేడియేషన్‌కు గురయ్యే వ్యక్తులు, పొగతాగే వ్యక్తులు బ్రెయిన్ ట్యూమర్‌లను అభివృద్ధి చేసే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. బ్రెయిన్ ట్యూమర్ చాలా ప్రమాదకరమైన వ్యాధి అని, సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాపాయం తప్పదని ఏ మాత్రం అనుమానం వచ్చినా వైద్యులను సంప్రదించాలని లేకపోతే ప్రాణాల మీదకు తెచ్చుకున్నవారవుతారన్నారు. తలనొప్పి, తలలో ఒత్తిడి, ఉదయం సమయంలో తీవ్రమైన తలనొప్పి, పడుకున్నప్పుడు తలనొప్పి ఎక్కువ అవడం, వికారం, వాంతులు, ఏదైనా రెండుగా కనిపించడం కణితి ఉన్న ప్రదేశాన్ని బట్టి లక్షణాలు మారుతాయని వివరించారు. కొన్నిసార్లు మూర్ఛ, కంటి సమస్యలు, మాటలు సరిగ్గా మాట్లాడలేకపోవడం, సరిగ్గా నడవలేకపోవడం, ముఖం ఓ వైపు తిరిగిపోవడం, ప్రవర్తనలో మార్పు, మతిమరపు లాంటివి కనిపిస్తాయని చెప్పారు. మెదడులోని కణితి పరిమాణాన్ని బట్టి స్థలాన్ని ఆక్రమిస్తుందని, కణతి పెరిగిన కొద్దీ మెదడు కణజాలంపై ఒత్తిడి పెరుగుతుందని వివరించారు. వీటిని గుర్తించడానికి ఎంఆర్ఐ చేయించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో హాస్పిటల్ ఇంచార్జి స్వామి, మార్కెటింగ్ ఇంచార్జి వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసిఆర్ నాయకత్వంలో మళ్ళీ పుంజుకుంటాం

- విజయం సాధిస్తాం.. భవిష్యత్ మనదే
- ఓటమి నుంచి నేర్చుకొని కొత్త ఉత్సాహంతో ముందుకెళ్లాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కేసిఆర్ నాయకత్వంలో మళ్ళీ పుంజుకుంటాం... విజయం సాధిస్తాం.. భవిష్యత్ మనదేనని బిఆర్ఎస్ శ్రేణులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సూచించారు. ఒక్కోసారి బలహీనుల చేతిలో కూడా బలవంతుడు ఓడిపోతాడని, జీవితంలో గెలుపు, ఓటములు సహజమని పేర్కొన్న ఆయన ఓటమి నుంచి నేర్చుకొని కొత్త ఉత్సాహంతో ముందుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అందుకు ఇప్పుడు జరుగుతున్న టీ20 వరల్డ్ కప్‌లో అమెరికా పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ ఒక ఉదాహరణగా చూడవచ్చు అన్నారు. ఈ టీ20 వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌లో అమెరికా చేతిలో పాకిస్థాన్ టీం ఓడిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. క్రికెట్ ప్రేమికుడైన ఆయన అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం డల్లాస్ సిటీలో నిన్న జరిగిన అమెరికా, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌ను యూఎస్ఏ క్రికెట్ బోర్డు చైర్మన్ వేణు పిసికే, డైరెక్టర్ శ్రీనివాస్‌ల ఆహ్వానం మేరకు వారితో కలిసి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి క్రికెట్ మ్యాచ్‌ను తిలకించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో కూడా స్పోర్ట్స్‌మెన్ స్పిరిట్ ఉండాలి.. ఓటమిని స్పోర్టివ్‌గా తీసుకోవాలన్నారు. బిఆర్ఎస్ శ్రేణులు కూడా మొన్నటి ఫలితాలతో నిరుత్సాహ పడకుండా రెట్టింపు ఉత్సాహంతో ముందుకెళ్లాలని సూచించారు. కేసిఆర్ నాయకత్వంలో వచ్చే ఏ ఎన్నికలైనా ఉత్సాహంతో ఎదుర్కొందాం...విజయం సాధిద్దామని పార్టీ శ్రేణులకు మాజి మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. క్రికెట్‌లో బలమైన జట్టుగా భావించే, గతంలో ప్రపంచ కప్ విజేత అయిన పాకిస్థాన్, ఇప్పుడిప్పుడే క్రికెట్‌లోకి అడుగుపెట్టిన పసికూన అమెరికా చేతిలో ఓడిపోవడం జీవితంలో ఎన్నో విషయాలు మనకు గుర్తు చేస్తుందన్నారు. ఒక్కోసారి బలహీనుల చేతిలో కూడా బలవంతుడు అనుకున్న వాడు ఓడిపోతాడని, అందుకు ఇప్పుడు జరుగుతున్న టీ20 వరల్డ్ కప్‌లో అమెరికా, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ ఒక ఉదాహరణగా చూడొచ్చన్నారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

- మృతిపై పలు అనుమానాలు
- ఇది ముమ్మాటికీ హత్యేనని కుటుంబ సభ్యులు ఆరోపణ
- పోలీసులు అదుపులో అనుమానితుడు..?

నవతెలంగాణ-డిచ్‌పల్లి





లకావత్ వెంగల్ (ఫైల్) .. అనుమానస్పదస్థితిలో వెంగల్ మృతదేహం

డిచ్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఇందల్‌వాయి మండలంలోని మేగ్యానాయక్ తాండకు చెందిన లకావత్ వెంగల్ (37) మృతదేహం లభ్యమైనట్టు ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లకావత్ వెంగల్ అనే వ్యక్తి గురువారం 06వ తేదీన ఉదయం 10 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. ఈ విషయంపై ఇందల్‌వాయి పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా లకావత్ వెంగల్ మృతదేహం డిచ్‌పల్లి మండలంలోని సిఎండి మెడికల్ కాలేజీ వద్ద గల చెట్ల పొదలలో అనుమానస్పద స్థితిలో వెంగల్ మృతదేహం లభించింది. వెంగల్ భార్య అనిత తన భర్త మృతిపై విచారణ జరిపి తగు చర్య తీసుకోవాలని డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో శుక్రవారం డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా ఘటన వద్ద పోలీసు జాగిలా క్షుణ్ణంగా పరిశీలించారు. నిజామాబాద్ ఎసిపి ఘటన స్థలానికి వచ్చి పరిశీలించి దర్యాప్తు బృందానికి సూచ నలు చేశారు. కుటుంబ సభ్యులకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

అనుమానుతుడి ఇల్లు దగ్ధం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు..

ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మేగ్యానాయక్ తాండకు చెందిన కొందరు మద్యం తాగించి హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో ఆగ్రహించిన గుర్తుతెలియని వ్యక్తులు అనుమానితుడి ఇల్లును దగ్ధం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వందల సంఖ్యలో తాండకు చేరుకొని శాంతి భద్రతలను పరిరక్షించారు. ఎలాంటి గొడవలు జరగకుండా సిఐ కె.మల్లేష్, ఎస్సై మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గత కొన్నేండ్లుగా మృతుడి బంధువుల్లో భూమి విషయంపై గొడవలు చోటుచేసుకుంటున్నాయని, కావాలనే వెంగలను హత్య చేయించారని తాండవాసులు, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. గత రెండు రోజుల పాటు ఆ అనుమానితుడు కూడా తమతోపాటే మొత్తం బృందాలకు విడిపోయి వెంగల ఆచూకీ కోసం తిరుగుతుండగా అనుమానితుడు సైతం తమ వెంటే ఉన్నాడని తండావాసులు చెబుతున్నారు.



అనుమానితుడి ఇంటికి నిప్పుపెట్టడంతో చెలరేగుతున్న మంటలు

చెల్లెను కాపాడబోయి అక్క మృతి

- వరద కాలువలో దూకిన చెల్లె..
- కాపాడేందుకు దూకి అక్క మృతి
- కమ్మర్‌పల్లిలో విషాదం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



శ్యామల మృతదేహం

వరద కాలువలో దూకిన చెల్లెను కాపాడబోయి అక్క మృతి చెందింది. ఈ విషాద ఘటన శనివారం మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో చోటుచేసుకుంది. కమ్మర్‌పల్లి ఎస్సై తెలిపిన ప్రకారం.. కమ్మర్‌పల్లి మండల కేంద్రం పరిధిలోని గాంధీనగర్‌లో నివాసముండే తన సంసారం విషయంలో భర్తతో గొడవ జరుగుతుండడంతో మంజులతో మాట్లాడి సర్ది చెప్పడానికి కామారెడ్డికి చెందిన ఆమె అక్క శ్యామల గాంధీనగర్‌లోని చెల్లెలు ఇంటికి వచ్చింది. చెల్లెలితో మాట్లాడుతూ సముదాయిస్తుండగా చెల్లెలు మంజుల పరిగెత్తుకుంటూ వెళ్లి గాంధీనగర్ కాలనీ పక్కనే ఉన్న ఎస్సారెస్పీ వరద కాలువలో దూకింది. కాపాడాలన్న తాపత్రయంతో చెల్లెలి వెనుకే పరిగెత్తుకుంటూ వెళ్లిన అక్క శ్యామల వరద కాలువలో దూకింది. గమనించిన స్థానికులు కాపాడేందుకు చీరలు విసిరారు. వాటి సాయంతో ముందుగా దూకిన చెల్లెలు ఒడ్డుకు చేరుకుంది. అక్క శ్యామల మాత్రం నీట మునిగి మృతి చెందింది. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ తెలిపారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఖలీల్‌వాడీలో గల విష్ణు ఫర్టిలిటీ హాస్పిటల్, మెడికేర్ హాస్పిటల్, కోణార్క్ హాస్పిటల్, లైఫ్‌లైన్ హాస్పిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్లీనికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అనుగుణంగా ఎన్ని ఉన్నాయి, వాటిలో రిజిస్టర్డ్ అయినవి ఎన్ని, రిజిస్టర్డ్ కానివి ఎన్ని, అందులో నిబంధనలకు అనుగుణంగా రెన్యూవల్ చేయించుకుంటున్నవి ఎన్ని, చేయించుకోనివెన్ని, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్‌కు అనుగుణంగా, నిబంధనలకు అనుగుణంగా ఆసుపత్రిలో వసతులు, సౌకర్యాలు ఉన్నాయా? లేదా? అనేది పరిశీలించారు. ఫైర్ సేఫ్టీ సౌకర్యాలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అనుమతులు, అదేవిధంగా బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ జరుగుతున్నదా, లేదా, ప్రతి ఆసుపత్రి ఎదురుగా తగినంత పార్కింగ్ సౌకర్యం అదేవిధంగా ఆరోగ్య సమాచారాన్ని ఆసుపత్రుల్లో ప్రదర్శన జరుగుతున్నదీ లేనిది తెలుసుకునేందుకు తనిఖీలు చేస్తున్నట్టు వివరించారు. ముఖ్యంగా ప్రజారోగ్యానికి సంబంధించిన సుమారు 18 వ్యాధుల నోటిఫికేషన్, ఒకవేళ ప్రైవేట్‌లో నమోదైతే వాటిని వెంటనే వైద్యారోగ్యశాఖ అధికారులకు తెలియజేసి తగిన సమయంలో వారికి చికిత్స అందించి సమాజంలో వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ తనిఖీలు రాష్ట్ర అధికారులు ఆదేశాల మేరకు జరుపుతున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ తెలిపారు. ఈ తనిఖీల్లో నిజామాబాద్ డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ అంజన, హెచ్ఈఓ సంతోష్, ఆరోగ్య కార్యకర్తలు శ్రీధర్, రఘు ఉన్నారు.